


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 02-08-2023 సంపుటి : 04 సంచిక : 290 పేజీలు : 8 వెల : రూ 3-00

## హింసపై మహిళల పోరుయాత్ర జయప్రదం చేయండి.



కర్నూలు, ఆగస్టు 1 విభారె న్యూస్ :హింసపై మహిళల పోరు బస్సు యాత్ర జూలై 28నుండి ఆగస్టు 9వ తేదీ వరకు జరుగు యాత్ర ను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు పి .నిర్మల కార్యదర్శి, ఎన్. అలివేలు అన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్లో మహిళా పోరు యాత్రకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూదేశంలోనూ రాష్ట్రంలోనూ మహిళలపై హింస రోజు రోజుకి విపరీతంగా పెరిగిపోతుంది. మల్ల యోధులు ఢిల్లీలో చేసిన ఆందోళన ఒక నిదర్శనం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల నిర్లక్ష్య ధోరణితో ఉ ండడం చేత హింస పెరిగిపోతుందన్నారు. కేంద్రం మతం పిచ్చిలో భారతదేశాన్ని సర్వనాశనం చేస్తూ మణిపూర్ లోమహిళలలను నగ్నంగా ఊరేగిస్తూ అత్యాచారాలు, హత్యలు చేస్తున్న మణిపూర్ తగలబెట్టిన మోడీనోరు మెదపకుండా ఉండడం ప్రధాని కె తలవంపు అన్నారు. చిన్నపిల్లలు మొదలుకొని వయోవృద్ధుల వరకు అత్యాచారాలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మధ్యాన్ని విచ్చలవిడిగా అమ్మడమేనని అన్నారు. ప్రభుత్వాలు హింసను అరికట్టే వరకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మహిళల పోరు యాత్ర చేపట్టిందని చెప్పారు. మహిళలకు చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. నిందితులకు ఫాస్ట్ ట్రాక్ కోట్లు ద్వారా త్వరితగతిన విచారణ జరిపి కఠినమైన శిక్షలు విధించాలన్నారు. హింస, అసలీలత అసమానతలను ప్రేరేపించే చలనచిత్రాలను, టీవీ సీరియల్స్ ను ఇంటర్నెట్ కార్యక్రమాలను నిషేధించాలన్నారు. అందుకు మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. కాలేజీల్లో పని ప్రదేశాల్లో వేధింపులు నిరోధక అంతర్గత ఫిర్యాదు కమిటీలు ఏర్పాటు చేసి అమలు చేయాలన్నారు. మద్యం మత్తు పదార్థాలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మహిళలను చైతన్యం చేసేందుకు మహిళలకు విద్య ఉపాధి హక్కులను గుర్తించి అమలు చేయాలన్నారు. పై డిమాండ్ల సాధనకు అన్ని పక్షాల కూడగట్టుకుని ఆందోళన సాగిస్తుందని చెప్పారు . ఆగస్టు 9న విజయవాడలో భారీ సభ నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనేందుకు జయప్రదం చేయాలని, అందుకు మీరంతా ఆర్థికంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఉపాధ్యక్షురాలు జి. ధనలక్ష్మి, కోశాధికారి పి.ఎస్. సుజాత, కిరణ్మయి, షబానా, కె .ఎస్. పద్మ, శిరీష, రుద్రమ్మ, ఓల్డ్ టౌన్ అధ్యక్షురాలు రషీదా, అమీనా తదితరులు పాల్గొన్నారు.

## పచ్చిమిర్చి వేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ డిఆర్ఓ కు రైతు సంఘం వినతి

కర్నూలు, ఆగష్టు 1విభారె న్యూస్ : పచ్చిమిరప సాగు చేసి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జి రామకృష్ణ, నాయకులు అబ్దుల్లా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిఆర్ఓ కు వినతి పత్రం అందించారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలంలోని రామళ్లకోట సర్పరాజపురం కలుగొట్ల బోయినిపల్లి నరసాపురం పుల్లగుమ్మి తదితర గ్రామాలలో వేలాది ఎకరాలలో ఈ సంవత్సరం మే జూన్ జూలై నెలలో రామళ్లకోట లోని నర్సరీల నుండి పచ్చిమిరప మొక్కలను ఒక మొక్క 70 నుండి 80 పైసలు పెట్టి కొనుగోలు చేసి ప్రతి సంవత్సరంలాగే రైతులు అన్ని జాగ్రత్తలు తీసుకొని పచ్చిమిర్చి సాగు చేశారు. ఎకరాకు 70 వేల నుండి 80 వేల వరకు నష్టపోయారని తెలిపారు. పంట మొత్తం పెరుగుదల లేకుండా పూర్తిగా నాశనం అవ్వడం వల్ల ఒక రామళ్లకోట గ్రామంలోనే రెండువేల ఎకరాలు సాగు చేసి 10 కోట్లు నష్టపోయారని ఇతర గ్రామాల్లో కూడా ఇదే విధంగా నష్టపోయారని రైతు సంఘం నాయకులు డిఆర్ఓ నాగేశ్వరరావు దృష్టికి తీసుకువచ్చారు. ఇతర ప్రాంతాల నుంచి మొక్కలు తెచ్చి నాటిన కొంత మంది రైతులకు మాత్రం పంట బాగా వచ్చిందని తెలిపారు. రామళ్లకోట నర్సరీలో మొక్కల వల్లే నష్టపోయిన పచ్చిమిర్చి రైతులకు ఎకరాకు 50 వేలు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించి ఆదుకోవాలని, లైసెన్స్ లేకుండా వందలాది నర్సరీలు నిర్వహిస్తున్నారని వాటిపైన తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించి వెల్దుర్తి మండలం లో తీవ్రంగా నష్టపోయిన పచ్చిమిర్చి రైతులను ఆదుకొని, లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న నర్సరీలపైన చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# ధరలు తగ్గించి నాణ్యమైన మద్యాన్నే అమ్ముతాం

విద్యుత్ ఉత్పత్తి పెంచి..ఛార్జీలు గతగ్గిస్తాం

సైకో సిఎం కారణంగా నష్టపోయిన రాయలసీమ

ముచ్చుమర్రి, బనకచర్ల ప్రాజెక్టులను సందర్శించిన బాబు





నంద్యాల,ఆగస్ట్1: టిడిపి అధికారంలోకి రాగానే మద్యం ధరలు తగ్గించడంతో పాటు..నాణ్యమైన మద్యాన్నే సరఫరా చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. విద్యుత్ ఉత్పత్తిని పెంచి ఛార్జీలు తగ్గిస్తామని అన్నారు. ఏడాదికి ఇరవై వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తానని చంద్రబాబు స్పష్టం చేశారు. రాయలసీమకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ద్రోహం చేశారని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. రాయలసీమలో అభివృద్ధి కోసం తాము రూ.12,400 కోట్లు ఖర్చు పెట్టామని, రాయలసీమ ద్రోహి అయిన జగన్ ఖర్చు చేసింది కేవలం రూ.2 వేల కోట్లే అని అన్నారు. జగన్ పదే పదే బటన్ నొక్కి డబ్బులు ట్రాన్స్ఫర్ చేస్తున్నానంటున్నారని ఎద్దేవా చేశారు. బటన్ నొక్కడం కాకుండా.. బటన్ బుక్కుడు ఎక్కువైందని ఎద్దేవా చేశారు. ఇప్పటిదాకా నిత్యావసరాల ధరలు పెంచడంతో పాటు విద్యుత్ ఛార్జీలు పెంచుకుంటూ పోయారని, ఇప్పటికి 8 సార్లు పెంచారని చంద్రబాబు అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో చంద్రబాబు మంగళవారం పర్యటించారు. నందికొట్కూరులో రోడ్ షో నిర్వహించి, అందులో మాట్లాడారు. ముచ్చుమర్రి, బనకచర్ల వంటి నీటి ప్రాజెక్టులను సందర్శించారు.వైఎస్ఆర్ సీపీ పాలనలో ఒక్కో నియోజక వర్గానికి ఒక్కో సైకో తయారు అవుతున్నారని చంద్రబాబు ఆరోపించారు. ఎవరైనా రౌడీయిజం చేస్తే తాటతీస్తానని, వదిలి పెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. 'సీఎం జగన్ గట్టిగా ఒక గంట పని చేయగలవా? సాయంత్రం 6 అయితే, కనిపిస్తావా? - పుట్టుకతో వృద్ధుడైన సైకో' అంటూ చంద్రబాబు కౌంటర్లు వేశారు. టీడీపీ హయాంలో ఎన్నో నీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టామని అన్నారు. హంద్రీనీవా, తెలుగు గంగ, ముచ్చుమర్రి, ఎస్ఆర్బీసీ లాంటి ప్రాజెక్టులు టీడీపీనే చేపట్టిందని గుర్తు చేశారు. రాయలసీమ కోసం జగన్ చిత్తశుద్ధితో పని చేశారా? అని నిలదీశారు. ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా సీఎం జగన్ చేశారని అన్నారు.సరిగ్గా రోడ్ల వేయలేరు కానీ, మూడు రాజధానులు కడతారట అంటూ ఎద్దేవా చేశారు.

## మంత్రి పెద్దిరెడ్డి రూ.35వేల కోట్లు దోచుకున్నారు: అమిత్‌షాకు రామచంద్రయాదవ్ ఫిర్యాదు

ఢిల్లీ: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.35వేల కోట్లు దోచుకున్నారని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిసి తగిన ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. మంగళవారం ఢిల్లీలో రామచంద్రయాదవ్ మీడియాతో మాట్లాడారు. పెద్దిరెడ్డి అవినీతిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)తో దర్యాప్తు చేయించాలని కోరినట్లు చెప్పారు. పెద్దిరెడ్డిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీఎంను డిమాండ్ చేశారు."పెద్దిరెడ్డి కుటుంబానికి 2019కి ముందున్న ఆస్తుల వివరాలు వెల్లడించకుండా ఎన్నికల సంఘాన్ని తప్పుదారి పట్టించారు. ప్రభుత్వం నుంచి అక్రమంగా రూ.వేల కోట్ల కాంట్రాక్టులు తీసుకుని ప్రజాధనాన్ని దోచుకున్నారు. పీఎల్ఆర్ కంపెనీపై 160 క్రిమినల్ కేసులు ఉన్నాయి. 17 మంది బినామీ డైరెక్టర్ల ద్వారా 60కిపైగా సూట్‌కేస్ కంపెనీలను సృష్టించారు. 2019 నుంచి 2023 వరకు చూస్తే కంపెనీ ఆదాయం కొన్ని వందల రెట్లు చూపించారు" అని రామచంద్రయాదవ్ ఆరోపించారు.

## ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లును లోక్ సభలో ప్రవేశ పెట్టిన కేంద్రం.. విపక్షాల ఆందోళన



ఢిల్లీ పరిపాలనను తమ కంట్రోల్ లోనే ఉంచుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు రాజధానిలో అధికారంలో ఉన్న కేజ్రీవాల్ ప్రభుత్వ సేవలపై నియంత్రణ విధిస్తూ కేంద్రం ఓ ఆర్డినెన్స్ ను తీసుకొచ్చి ంది. ఆ ఆర్డినెన్స్‌కి సంబంధించిన బిల్లును మంగళవారం లోక్ సభ లో ప్రవేశపెట్టింది.ఢిల్లీలో ప్రభుత్వ అధికారుల బదిలీలు, నియామకాల విషయంలో తీసుకొచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో రూపొందించిన 'ది గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెర్రిటొరీ ఆఫ్ ఢిల్లీ 2023' బిల్లును కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభలో ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఢిల్లీకి సంబంధించిన ఏ చట్టాన్నైనా రూపొందించే అధికారాన్ని లోక్ సభకు రాజ్యాంగం కల్పించింది' అని అన్నారు.ఈ బిల్లు సభలో పాస్ అయితే ఢిల్లీలోని అధికారులపై పెత్తనం అంతా కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి వెళ్తుంది. అధికారుల నియామకాలు, బదిలీల అంశం కేంద్రం నియంత్రణలోకి వెళ్తుంది. ఈ విషయంలో ఢిల్లీ ప్రభుత్వానికి ఎలాంటి అధికారాలు ఉండవు. దీంతో ఈ బిల్లును ఆప్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ విషయంలో విపక్ష ఇండియా కూటమి పార్టీలు కేజ్రీవాల్ కు అండగా నిలిచాయి. బిల్లును అమిత్ షా సభలో ప్రవేశపెడుతున్నప్పుడు ఇండియా కూటమి ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.దేశ రాజధానిలోని పరిపాలన సేవలపై నియంత్రణను గవర్నర్ కి అప్పగించేలా కేంద్రం ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దీన్ని ఢిల్లీ ప్రభుత్వం మొదటి నుంచి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆర్డినెన్స్ విషయంలో తమకు మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విపక్షాల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ సహా విపక్ష పార్టీలు కేజ్రీవాల్ కు మద్దతు తెలిపాయి. మరోవైపు కేంద్రం ఆర్డినెన్స్ పై ఆప్ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం మే 11న కీలక తీర్పు ఇచ్చింది .

## పవన్ కళ్యాణ్‌పై సినిమా తీస్తా

బ్రో సినిమాలో నన్ను అపహాస్యం చేసేలా పాత్ర

పెళ్లిళ్లు-పెటాకులు.నిత్యపెళ్లికొడుకు లాంటి టైటిళ్లు

పవన్ తీరుపై మండిపడ్డ మంత్రి అంబటి రాంబాబు

విజయవాడ,ఆగస్ట్1): జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పై బయోపిక్ తీస్తానని మంత్రి అంబటి రాంబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ అందరు భార్యల పిల్లలతో పాటు మహిళా లోకం అతడికి గుణపాఠం చెబుతారని.. సినిమా వర్క్ మొదలైందన్నారు. కొందరు నటీనటులను సంప్రదించామన్న ఆయన.. నిత్యపెళ్లి కొడుకు, పెళ్లిళ్ల పెటాకులు, తాళి- ఎగతాళి, మూడు ముళ్లు- ఆరు పెళ్లిళ్ల, బహుభార్యా ప్రావీణ్యుడు, మ్యారేజెస్ రిలేషన్స్ అఫెండర్, 'అయిన పెళ్లిళ్లెన్నో పోయిన చెప్పులు ఎన్నో' అనే టైటిల్స్ పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు తమకు మంచి టైటిల్ సూచించినా పరిశీలిస్తామని, ప్రజాదరణ తమకు ముఖ్యమన్నారు. అసలే ఎన్నికలు వస్తున్నాయి, సాధ్యమైనంత త్వరగా పవన్ పై సినిమాను పూర్తి చేస్తామని చెప్పారు. తనను కించపరచాలని బ్రో సినిమాలో ఉద్దేశపూర్వకంగా శ్యాంబాబు పాత్ర క్రియేట్ చేశారని మరోసారి ఆరోపించారు. ఇలాంటి సినిమాలు చూస్తే జనాలు ఆదరించరని, ఇకనుంచి పవన్ సినిమాలు సక్సెస్ అయ్యే ఛాన్స్ లేదని వ్యాఖ్యానించారు. అయితే ఎవర్ని పడితే వార్ని కెలికితే గుణపాఠం తప్పదు అంటూ సినిమా రంగాన్ని అంబటి హెచ్చరించారు.

బ్రో సినిమాలో శ్యాంబాబు అనే పాత్రను పవన్ కళ్యాణ్ దూషించి, కించపరిచేలా క్యారెక్టర్ ను క్రియేట్ చేశారని మంత్రి అంబటి అన్నారు. సినిమా కలెక్షన్లు తగ్గుతున్నాయి కనుక సినిమాపై కాంట్రవర్సీ చేయడంపై మూవీ యూనిట్ ఫోకస్ చేసిందని ఎద్దేవా చేశారు. భారీ బడ్జెట్ తో తెరకెక్కించిన బ్రో సినిమా అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. సినిమాకు 65 నుంచి 70 కోట్లు వరకు మాత్రమే వచ్చే అవకాశం ఉందన్నారు. సినిమాపై ఫోకస్ చేయకుండా, కొందరు వ్యక్తులను టార్గెట్ చేసి సినిమా తీస్తే ఫోకస్ పోయి కమర్షియల్ హిట్ అవ్వదన్నారు. త్రివిక్రమ్, పవన్ కళ్యాణ్ కూర్చుని ఓ సీన్ క్రియేట్ చేసి ఆనందాన్ని పొందుతున్నారని ఆరోపించారు.

## దాసోజు శ్రావణ్ కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంపై హర్షం

మాట్లాడుతున్న రామాచారి



ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 1విభారె న్యూస్ :- దాసోజు శ్రావణ్ కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంపై ఆళ్లగడ్డ విశ్వ బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం విశ్వరూప నగర్ తన నివాసంలో రామాచారి విశ్వకర్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సోదరుడు శ్రీదాసోజుశ్రావణ్ కు గవర్నర్ కోటలో ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి కి, గతంలో తెలంగాణ మాజీ తొలి శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి కి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇచ్చి విశ్వబ్రాహ్మణ జాతిని గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణుల పరిస్థితి ఎందుకు భిన్నంగా ఉందని, జగన్మోహన్ రెడ్డి విశ్వబ్రాహ్మణులకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తామని మాట ఇచ్చి నిలబెట్టుకోలేకపోయారని ఈ సందర్భంగా రామాచారి విశ్వకర్మ గుర్తు చేశారు.

## వింతంతు పింఛన్ అందడం లేదని మహిళ ఆవేదన



పెద్దకడబూరు ఆగష్టు 01: ( విభారె న్యూస్)పెద్దకడబూరు మండలంలోని పెద్దకడబూరు గ్రామంలో ఎస్సీ కాలనీ దళిత వాడ అయినటువంటి కామవరం బుజ్జమ్మ పెళ్లి అయ్యి దాదాపుగా 30 సంవత్సరాలు అయింది. భర్త గత 30 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో భర్త ఊరు వదిలిపెట్టి పుట్టినిల్లు అయినటువంటి పెద్దకాడబురు గ్రామం వచ్చి చేరింది. అయితే ఆమెకు వితంతువు పింఛన్ మరియు వైయస్సార్ చేయూత రావడం లేదని మహిళ వాపోయింది.

# సంపాదకీయం

బుధవారం 02-08-2023

## విపత్తు నిర్వహణ తక్షణ అవసరం !

విపత్తుల సమయంలో సకాలంలో స్పందించేలా వ్యవస్థను పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఎన్డీఆర్ఎఫ్ దళాలు ఉన్నా దానిని మరితంగా పటిష్టం చేయాలి. దీనికి ఆర్టీ తరహా వ్యవస్థ అవసరం ఉంది. దేశంలో ఏ మూల ఎలాంటి ఉపద్రవం ముంచుకుని వచ్చినా సకాలంలో చేరుకుని సేవలు అందించే విధంగా తయారు కావాల్సి ఉంది. రైలు ప్రమాదాలు కావచ్చు.. వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో సకాలంలో సత్వర సేవలు అందించే వీలు కలుగుతుంది. ఇటీవలి వరదలు, రైలు ప్రమాదాలు చూశాక శిక్షిత సిబ్బందంది అవసరముందని తెలుస్తోంది. దానికి సాంకేతికంగా సహాయ సహకారం అందించాలి. ప్రస్తుతానికి విపత్తులను ఎదుర్కోవడంలో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు అనుసరించిన మార్గాలే ఇప్పుడు శరణ్యంగా మారాయి. ఈ దుస్తితి పోవాలంటే ఓ అత్యున్నత వ్యవస్థ అవసరం అన్నది గుర్తించాలి. కేంద్రరాష్ట్రాలు ఇందుకు ముందుకు రావాలి. ఉమ్మడిగా వ్యవస్థను తయారు చేసుకోవాలి. దీనిని ఆర్మీలో భాగంగా చేస్తే మరీ మంచిది. సాధారణ ఆర్మీ ఇలాంటి సమయాల్లో అంతగా పనిచేయకపోవచ్చు. కానీ విపత్తు నిర్వహణకు కూడా ఆర్మీలాంటి దళాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తే మంచిది. భూకంపాలు, అగ్నిప్రమాలు, వరదలు లాంటి ప్రమాదాల సమయాల్లో తక్షణం స్పందించేలా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. దేశంలో ఎక్కడ ఏ మూల ప్రమాదం జరిగినా సహాయక చర్యలకు దిగేలా తీర్చిదిద్దాలి. ఇలాంటి దళాలను ఏర్పాటు చేయడంతో పాటు,ఆర్థిక సంపత్తిని కూడా కట్టిబెడితే మంచిది. దీనిద్వారా విపత్తు నిర్వహణతో పాటు, నిరుద్యోగ సమస్యకూడా కొంతమేర తీరవచ్చు. ఈ దిశగా ఆలోచనలు చేసి ఆచరణకు సిద్దపడాలి. అప్పుడు ఎక్కడ ఏ ఉపద్రవం వచ్చినా రంగంలోకి దిగేలా అవకాశం ఉంటుంది. ఏటా దేశవ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా వరదలు ముంచెత్తుతున్నాయి. భారీ వర్షాల మూలంగా పెద్దయెత్తున నీరు వచ్చి చేరుతుండడంతో ప్రధానమైన డ్యాముల గేట్లను తెరవాల్సి రావడంతో దిగువన ఉన్న లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధనంలో చిక్కుకుని విలవిల్లా డుతున్నాయి. విపత్తుల సమయంలో స్వతంత్ర వ్యవస్థ రంగంలోకి దిగి ప్రజలను కాపాడడంతో పాటు, సహాయాక చర్యల్లో నిమగ్నమయ్యేలా ఉంటే విమర్శలకు ఆస్కారం ఉండదు. హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, కేరళ తమిళనాడు, తెలంగాణ, ఎపిల్లో ఏటా కుండపోతగా కురుస్తున్న వర్షాలతో ప్రజాజీవనం అతలాకుతలం అవుతున్నాయి. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, విరిగిపడుతున్న కొండ చరియలు, తెగిపోయిన రోడ్లు సాధారణ పౌర జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. లోతట్టు ప్రాంత ప్రజలను సకాలంలో సహాయక శిబిరాలకు తరలించడం, ప్రాణనష్టాన్ని తగ్గించగలగడం అన్నది ఇలాంటి సమయాల్లో ముఖ్యం. పునరావాస శిబిరాల్లో బాధితులకు మంచినీరు, ఆహారం, మందులు వంటి కనీస సదుపాయాలు కల్పించడం, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం కూడా ముఖ్యమే. ప్రత్యేక యంత్రాంగం ఉండివుంటే వెంటనే రంగంలోకి దిగి యుద్ధ ప్రాతిపదికపై సహాయక చర్యలు చేపట్టే వీలుంటుంది. విపత్తు నిర్వహణ అన్నది ఉమ్మడి వ్యవహారంగా ఉంటనే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తక్షణం ఆదుకునేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీనికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసుకోవాలి. ప్రత్యేకంగా నిధులను సమకూర్చాలి. లేదా కేంద్ర,రాష్ట్రాలు ఉమ్మడిగా నిధులు సమకూర్చాలి. అలాగే దీనిని సైన్యంలో ఒక భాగంగా చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. భారత్ లాంటి దేశానికి ఇది తక్షణావసరమని పాలకులు గుర్తించాలి. ఇప్పటివరకు జరిగిన అనేక విప్తతులను దృష్టిలో పెట్టుకుని తగిన తర్ఫీదు ఇచ్చి స్వయం శక్తిగా దీనిని రూపొదించాలి. దేశంలో ఎక్కడ ఏ మూలన ఎలాంటి ఉపద్రవం వచ్చిపడినా తక్షణం రంగంలోకి దిగేలా అన్ని రాష్ట్రాల్లో సన్నద్ధంగా ఉండేలా చూడాలి. ప్రస్తుత వ్యవస్థలో ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా బయటకు తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర విపత్తు, సహాయక బృందాలు ప్రశంసనీయమైన కృషిచేస్తున్నాయి. అయితే ఇందులో ప్రధాన భూమిక రాష్ట్రాలదిగానే ఉంటోంది. అలాగాకుండా వ్యవస్థ ఉంటే సాయం కోసం కేంద్రంవైపు చూడాల్సిన ఆగత్యం రాదు. ఇప్పటికే స్వచ్ఛంద సంస్థలు, సహకార సంఘాలు, చలన చిత్ర పరిశ్రమ, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజలు ఉదారంగా ముందుకు వచ్చి విరాళాలందిస్తున్నారు. అయితే ఏటా ఎక్కడో ఓ చోట ఇలాంటి విపత్తులు సర్వ సాధారణంగా మారిన దశలో ప్రత్యేక,శాశ్వత ఏర్పాటు అవసరాన్ని గుర్తించాలి. అసాధారణ వరదలు కావడంతో పెద్దయెత్తున ఆస్తినష్టం కలిగించాయి. ఇటీవలి వరదల్లో వేల ఎకరాల్లో పంటలు తుడిచి పెట్టుకునిపోయాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ, సహాయక అథారిటీని పటిష్టపరచినప్పటికీ ఇప్పుడు సంభవించిన విపత్తు అసాధారణమైనది. దీనిని ఎదుర్కోవడం అంత తేలికేమీ కాదు. అయినా, పరిస్థితి తీవ్రతకు మించిన వేగంతో ప్రభుత్వం కదిలింది. నదికి ఇరువైపులా వున్న ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసింది. ఇకపోతే విపత్త బృందం ఉంటే నష్టం అంచనా కూడా వెంటనే గుర్తించవచ్చు. లేకుంటే కేంద్రబృందం ఎప్పుడో నెల తరవాత రావడం...పోటోలు చూడడం..అంచనా వేయడం జరుగుతోంది. అలా గాకుండా వెంటనే నష్టం అంచనాలు కూడా జరిగిపోవాలి. సహాయక చర్యలతో పాటు పునరావాస చర్యల్లో కూడా ఈ బృందాలు పాల్గొనేలా చేయాలి. ఇలా చేస్తే మంచి ఫలితాలతో పాటు సకాలంలో సాయం అందగలదు.

# కాంగ్రెస్ పార్టీ ని గెలిపించడమే లక్ష్యంగా పనిచేయాలి.



**- ప్రజా ఉద్యమాలకు మహిళలు సిద్ధం కావాలి.**

**- జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి సత్య నారాయణ గుప్త.**

కర్నూలు ఆగష్టు 01 విభారె న్యూస్.రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడమే లక్ష్యంగా ముందడుగు వేయాలని ప్రజా ఉద్యమాలకు మహిళలు సిద్ధంగా ఉండాలని కర్నూల్ డి సి సి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తూరు సత్యనారాయణ గుప్తా పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా కొత్తూరు సత్యనారాయణ గుప్తా మాట్లాడుతూ దేశ అభ్యున్నతి కోసం దేశ ఐక్యత కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కృషిని ప్రజలకు చేరువ అయ్యేలా మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలి అన్నారు.ప్రజా సమస్యలపై ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రేమ అనురాగాలు కలిగి ఉన్నాయని, రేపటి తరానికి దశ దిశ నిర్ణయించేది కాంగ్రెస్ పార్టీ ఒకటే అన్నారు.నిత్యవసర ధరలు పెరిగిపోతున్నాయని సామాన్యుడికి అందుబాటు లేకుండా పోతున్నాయని ఆయన తెలిపారు.రాష్ట్రంలో దేశంలో మహిళలకు భద్రత లేకుండా పోతుందని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళలు సమిష్టిగా ఉండి పోరాటం చేయాలన్నారు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలని మహిళా సంఘాల ప్రతినిధులకు కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అంటే ఒక నమ్మకమని బిజెపి అంటే అమ్మకమని ఆయన ఎద్దేవా చేశారు మోడీ ప్రభుత్వం జగన్ ప్రభుత్వం మాటల గారడి తో ప్రజలను మభ్యపెట్టడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా తో పాటు రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని రాహుల్ గాంధీ హామీ ఇవ్వడం జరిగిందని 500 కే గ్యాస్ సిలిండర్ అందించడం జరుగుతుందని ఇచ్చిన మాటను కట్టుబడి ఉంటుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీమతి ప్రమీల,కాంగ్రెస్ సేవాదళ్ మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీమతి సుజాత,నగర సేవాదళ్ అధ్యక్షురాలు శ్రీమతి రాధిక పలువురు కాంగ్రెస్ మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీలతో సబ్ కలెక్టర్ సమీక్ష సమావేశం



**సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డిఓ శ్రీనివాస్**

ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 1 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ముసాయిదా ఓటర్ల జాబితా పై అన్ని రాజకీయ పార్టీల బూత్ కమిటీ సభ్యులు నియోజకవర్గంలోని అందే మండలాల తాసిల్దార్లతో నంద్యాల సబ్ కలెక్టర్ శ్రీనివాస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి ఎల్ ఓ లు డోర్ టు డోర్ వెళ్లి 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులను ఓటరు జాబితాలో ఎన్రోల్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ సర్వే కార్యక్రమంలో భాగంగా తాము ఇక్కడికి రావడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని రాజకీయ పార్టీలతో దీనికి సంబంధించి ప్రతి మంగళవారం సర్వే పూర్తయ్యేవరకు సమావేశం నిర్వహిస్తామని ఆయన అన్నారు. సర్వే అనంతరం తుది ఓటర్ జాబితా రూపొందిస్తామని సబ్ కలెక్టర్ ఏ శ్రీనివాస్ పేర్కొన్నారు. సమావేశంలో ఆళ్లగడ్డ ఎమ్మార్వో హరినాథ్ రావు, సిరివెళ్ల మండల తాసిల్దార్ షేక్ మొహిద్దిన్, రుద్రవరం తాసిల్దార్ రవీంద్ర ప్రసాద్, ఉయ్యాలవాడ తాసిల్దార్ రవికుమార్, ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, ఎంపీడీవో మహబూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## టిట్కో గృహాలకు మౌలిక వసతులు కల్పించాలి -సి.పి.ఐ. పార్టీ



ఎమ్మిగనూరు టౌన్ ఆగస్టు 1 విభారె న్యూస్:-ప్రభుత్వం పంపిణీ చేసిన కిడ్కో గృహాలకు మౌలిక వసతులు కల్పించాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా సహాయ కార్యవర్గ సభ్యుడు పంపన్న గౌడ్ పట్టణ కార్యదర్శి రంగన్నల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివనగర్ ప్రాంతంలో నిర్మించిన గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారని , వాటికి మౌలిక సదుపాయాలు డ్రైనేజీ, తాగునీటి వసతి, కరెంటు తదితరవసతులు కల్పనలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. ఇప్పటికైనా వసతులు కల్పించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చిన్నన్న, రైతు సంఘం తాలూకా కార్యదర్శి జబ్బర్, సిఐటియు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు వీరేశ్, తిమ్మ గురుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర, రంగస్వామి, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళు

**ఎమ్మెల్యే గంగుల నాని**



**సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల నాని**

ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 1 విభారె న్యూస్ :- సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళ లాంటివని ఎమ్మెల్యే గంగుల నాని అన్నారు. పట్టణంలోని తొమ్మిదవ వార్డు, నాల్గవ సచివాలయం పరిధిలోని గాయత్రి మాత దేవాలయం సమీపంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల నాని, నంద్యాల విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్వీ జగన్మోహన్ రెడ్డి తో కలిసి నాలుగు సంవత్సరాల కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ ఫలాల గురించి ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 97% పూర్తి చేశారన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ కి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ గోపవరం నరసింహారెడ్డి, ఆళ్లగడ్డ పట్టణ వైకాపా కన్వీనర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ల పంపిణీ పరిశీలించిన కమిషనర్.







ఎమ్మిగనూరు టౌన్ ఆగస్టు 1 విభారె న్యూస్:-పట్టణంలోని పంపన గౌడ్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి మంగళవారంపర్యటించి పెన్షన్ల పంపిణీని పరిశీలించారు.ప్రతి నెల ఒకటో తేదీన పెన్షన్లు అందుతున్నాయో లేదో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డలో పులి సంచారం వట్టి వదంతులే

**స్పష్టం చేసిన అటవీ శాఖ అధికారులు**



**విలేకరులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాసరెడ్డి**

ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 1విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ పట్టణంలోని నత్రం వీధిలోని దాల్ మిల్లు సమీపంలో సోమవారం రాత్రి చిరుతపులి సంచరించినట్లు వచ్చిన వార్తలు అవాస్తవాలని రుద్రవరం ఫారెస్ట్ రేంజ్ అటవీ శాఖ అధికారి శ్రీనివాసుల రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానికులు కొందరు తాము చిరుతపులి ని ప్రత్యక్షంగా చూసినట్లు పోలీసులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడం తో ఆళ్లగడ్డ టౌన్ రమేష్ బాబు, సిబ్బంది, అటవీశాఖ అధికారులు సిబ్బంది గత రాత్రి దాలు మిల్లు పరిసరాలను మొత్తం పరిశీలించడం జరిగిందని ఈ ప్రాంతంలో ఎక్కడ కూడా పులి సంచరించిన అడుగు జాడలు గాని వాటికి సంబంధించిన పాదముద్రలు కానీ ఇతరత్రా వాళ్లు కానీ తమకు ఎక్కడ లభ్యం కాలేదని ఫారెస్ట్ అధికారి శ్రీనివాసుల రెడ్డి పేర్కొన్నారు. స్థానికులు ఒకవేళ జంగుపిల్లిని చూసి కూడా పులి అని భ్రమపడి ఉండవచ్చని అన్నారు. నల్లమల అటవీ ప్రాంతం ఇక్కడికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉండడం వల్ల అక్కడినుండి పట్టణంలోకి పులి ప్రవేశించే అవకాశం ఏమాత్రం లేదని ఆయన స్పష్టం చేశారు.ఈ విషయంపై ప్రజలెవరు భయాందోళన చెందవలసిన అవసరం లేదని ఫారెస్ట్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి వివరించారు. రుద్రవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు ఆదేశాల మేరకు తమ సిబ్బంది పరిసర ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

## కెవి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థికి 3.5 లక్షల ప్యాకేజీ తో సాఫ్ట్వేర్ ఉద్యోగం

**హర్షం వ్యక్తం చేసిన కళాశాల అధ్యాపక బృందం**



ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 1 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ పట్టణంలోని కెవి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాలలో బి బి ఏ మూడవ సంవత్సరం చదువుతున్న ఎ. తనూజ అనే విద్యార్థిని ఆక్వెంచర్ కంపెనీలో సాఫ్ట్వేర్ ఉద్యోగానికి ఎంపికైంది. సంవత్సరానికి 3.5 లక్షల ప్యాకేజీ ని ఆ విద్యార్థినికి వేతనంగా సాఫ్ట్వేర్ కంపెనీ ప్రకటించింది. ఈ సందర్భంగా విద్యార్థి తనూజ కు తల్లిదండ్రుల సమక్షంలో కాల్ లెటర్ ను కళాశాల ప్రిన్సిపల్ శ్రీనాథ్ రెడ్డి, డైరెక్టర్ భూమా శ్రీనివాస్ రెడ్డి లు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థిని విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి కష్టపడి బాగా చదువుకొని తనూజ లాగానే అందరూ ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. తద్వారా తల్లిదండ్రుల ఆశలు సఫలీకృతం అవుతాయన్నారు. అనంతరం సాఫ్ట్వేర్ ఉద్యోగానికి ఎంపికైన తనుజను కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

## జనన ధ్రువీకరణ పత్రాల కోసం లంచం

**రెడ్ హ్యాండెడ్ గా వీఆర్వోను**

**పట్టుకున్న ఏసీబీ అధికారులు**

నెల్లూరు నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం దేపూరు విఆర్ఓ మాలాద్రిని లంచం తీసుకుంటూ ఉండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు.రావెళ్ల వెంకటేశ్వర్లు అనే రైతు నుండి తన ఇద్దరి కుమారుల బర్త్ సర్టిఫికెట్ కోసం లంచం తీసుకుంటూ ఉండగా ముందస్తుగా వేసుకున్న పథకం ప్రకారం పట్టణంలోని ఓ బ్యాంకు సమీపంలో పదివేల రూపాయల లంచం ఇస్తూ ఉండగా వీఆర్వో మాల్యాద్రిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ డి.ఎస్.పి మోహన్ సిఐ ఆంజనేయులు రెడ్డి వారి బృందం.. ఈ సందర్భంగా రైతు వెంకటేశులు మాట్లాడుతూ తనను తమ గ్రామ విఆర్ఓ మాల్యాద్రి నానా ఇబ్బంది గురి చేస్తున్నాడని ప్రతి పనికి లంచం అడుగుతూ ఉంటాడని ఇదే క్రమంలో తన ఇద్దరు పిల్లల జనన ధ్రువీకరణ పత్రం మంజూరు కొరకు 15000 రూపాయలు లంచం అడగగా అంత స్తోమత నా దగ్గర లేక ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు వారి సహకారంతో ఈరోజు వీఆర్వోకు పదివేల రూపాయలు డబ్బులు ఆత్మకూరు పట్టణంలో అందజేస్తూ అతన్ని పట్టించినట్టు రైతు తెలిపాడు.

## మాజీ ఎంపి రాయపాటి ఇంటిపై ఈడీ దాడి

గుంటూరు టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ రాయపాటి సాంబశివ రావు నివాసంలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ దాడులు చేపట్టింది. ఉదయం నుంచే ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో సోదాలు జరుపుతోంది.ట్రాన్స్‌స్టాయ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ.. బ్యాంకు రుణాల ఎగవేత అంశంపై గతంలో మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. కేసు విచారణలో భాగంగానే రాయపాటి నివాసంలో తనిఖీలు చేపట్టారు అధికారులు. హైదరాబాద్, గుంటూరు సహా తొమ్మిది చోట్ల సోదాలు నిర్వహించామని, రాయపాటి, ఇతర ప్రమోటర్ల కార్యాలయాలు, నివాసాల్లో సోదాలు జరిగాయని ఈడీ వర్గాలు పేర్కొన్నాయి.మరోవైపు హైదరాబాద్ నగరంలో మరోసారి ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. జూబ్లీహిల్స్, మణికొండ, పంజాగుట్టలో ఉదయం నుంచే దాడులు జరుపుతోంది. మాలినేని సాంబశివరావుతో పాటు పలువురి ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. మొత్తం 15 బృందాలతో ఏకకాలంలో సోదాలు చేస్తున్నారు.

## ఒంగోలు మెడికల్ కాలేజీలో గంజాయి దందా

ఒంగోలు, ఆగస్టు1 , ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి విక్రయాలు, వినియోగంపై పెద్ద ఎత్తున దుమారం రేగుతున్న వాటి కట్టడికి తీసుకుంటున్న చర్యలు మాత్రం కనిపించడం లేదు. తాజాగా ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థులు గంజాయి వినియోగానికి అలవాటు పడటం కలకలం రేపుతోంది.ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో వ్యసనాలకు బానిసలైన ఏడుగురు గంజాయి, మద్యం తాగి గొడవలు చేస్తున్నారంటూ సహ విద్యార్థులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగు చూసింది. పడటం అందరిని ఆందోళనకు గురి చేస్తోంది. ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో 2020 బ్యాచ్‌కు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థులపై సహ విద్యార్థులు ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు. మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల్లో ఏడుగురు వ్యసనాలకు బానిసై అందరినీ ఇబ్బందులకు గురిచేస్తున్నారని మిగిలిన విద్యార్థులు ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌బాబుకు సోమవారం ఫిర్యాదు చేశారుప్రభుత్వ వైద్య కళాశాలలో? జిల్లాలకు చెందిన ఏడుగురు విద్యార్థుల తీరుపై గతేడాది కాలంగా కాలేజీ యాజమాన్యానికి ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి.

# ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు

తిరుమల, ఆగస్టు 1,తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. సాధారణంగా తిరుమలలో బ్రహ్మోత్సవాలు ఏడాదికి ఒకసారి జరుగుతాయి, కానీ అధికమాసం కారణంగా ఈ ఏడాది రెండు పర్యాయాలు బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని టీడీడీ నిర్ణయించింది. ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. మరోవైపు పురటాసి మాసం కూడా వస్తున్నందున తిరుమలకు భక్తుల రద్దీ అత్యధికంగా ఉంటుందని టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి చెప్పారు. అన్నివిభాగాల అధికారులు సమన్వయం చేసుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు.అధిక మాసం కారణంగా ఈ ఏడాది 2 సార్లు శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరపనున్నట్లు తెలిపారు. మొదట సెప్టెంబర్ 18 నుండి 26వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఉంటాయి. అదేవిధంగా అక్టోబర్ 15వ తేదీ నుంచి 23 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఒకటిన్నర నెల ముందుగానే ప్రారంభించినట్లు చెప్పారు. 15 రోజుల తరువాత జిల్లా అధికారులతో టీటీడీ సమీక్ష నిర్వహించనుందని తెలిపారు.తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 18న ధ్వజారోహణం నిర్వహిస్తారు. ఆరోజు ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరపున వేంకటేశ్వర స్వామికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. సెప్టెంబర్ 22వ తేదీన గరుడ సేవ, 23న స్వర్ణరథం, 25వ తేదీన రథోత్సవం, 26వ తేదీన చక్రస్నానం, ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు టీటీడీ ఈవో ధర్మారెడ్డి వెల్లడించారు.నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 15న ప్రారంభం కానుండగా.. అక్టోబర్ 19వ తేదీన గరుడ వాహనం, 22న స్వర్ణరథం, అక్టోబర్ 23న చక్రస్నానం నిర్వహిస్తామని చెప్పారు. శ్రీవారి అన్నప్రసాదం, ఇంజినీరింగ్ పనులు, దర్శనం, కళ్యాణకట్ట, రవాణా, వసతి, పోలీసు, వైద్యం, ఆరోగ్యం, హెచ్‌డిపిపి, ఉద్యానవనం, శ్రీవారి సేవకుల సమన్వయంతో టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం భద్రతా ఏర్పాట్లపై సమీక్ష జరిగింది.పురటాసి మాసం,

రెండు బ్రహ్మోత్సవాలు ఉన్నందున తిరుమలకు ఈ ఏడాది భక్తుల రద్దీ అధికంగా ఉండనుంది. పురటాసి పవిత్ర మాసం సెప్టెంబర్ 18న ప్రారంభమై అక్టోబరు 17న ముగియనుంది. సెప్టెంబరు 23, 30, అక్టోబర్ 7, 14 తేదీల్లో పురటాసి శనివారాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలతో పాటు పురటాసి శనివారాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని తెలిపారు.తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన 31 దేశాలకు చెందిన 24,583 చిరిగిన కరెన్సీ నోట్లను ఆగష్టు 18,19వ తేదీల్లో ఈ - వేలం వేయనున్నారు.

# కాపు కాసేదెవరు...

కాకినాడ, ఆగస్టు 1, కాపు సామాజికవర్గంలో ఆధిపత్య ధోరణి ఆ వర్గం కొంప ముంచుతోంది.తరతరాలుగా నాటుకుపోయింది ఈ ఆధిపత్య భావజాలాన్ని వదిలించుకోకపోతే బీసీల మద్దతు కూడగట్టే అవకాశాలు లేవు.కాపు సామాజికవర్గంలోని ఆధిపత్య ధోరణి కారణంగా తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల్లో మిగిలిన అన్ని కులాల ప్రజలకూ దూరమైంది.ఈ విధంగా ఇతర సామాజికవర్గాలన్నింటినీ కాపులు శత్రువులుగా తయారు చేసుకున్నారు.కాపు నాయకుల ఆధ్వర్యంలో వచ్చిన రాజకీయ పార్టీలు ఎన్నికల్లో విఫలమవడానికి ఇదే కారణమని ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు.గోదావరి ప్రాంతంలో కాపులకు బీసీలు వ్యతిరేకం.కాపుల ఆధిపత్యాన్ని షెడ్యూల్డ్ కులాలు అంగీకరించరు. క్షత్రియులు కాపులకు దూరంగా ఉంటారని కలకత్తాలోని సామాజికశాస్త్రాల పరిశోధనా సంస్థ సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ సోషల్ సైన్సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ చెన్నూరి సతీష్ అంటున్నారు.ఆయన కాపుల రాజకీయ సమీకరణపై డాక్టరేట్ చేశారు. కాపుల రాజకీయ పోరాటాలు,సామాజిక,ఆర్థిక,సాంస్కృతిక ఆరాటాలపై సతీశ్ సమగ్ర అధ్యయనం చేశారు.ఆయన అభిప్రాయాలతో మేధావులు,ఇతర కులాలకు చెందిన ఆలోచనాపరులు ఏకీభవించినా,ఏకీభవించకపోయినా ఆయన పరిశీలన ముమ్మాటికీ నిజం. ంశ్రీబనీ ఖీవజీట - కాంగ్రెస్ పార్టీలో స్నోబాల్ ఎఫెక్ట్ మొదలైందా? 1980లలో తెలుగుదేశం పార్టీ నిర్మాణానికి ముందు పలువురు రాజకీయ నాయకులతో ఎన్టీఆర్ సంప్రదింపులు జరుగుతున్న కాలంలో 'కాపు,బలిజ,తెలగ,ఒంటరి కులాల సంఘం' పేరుతో కాపులను సమీకరించడానికి గోదావరి జిల్లాల్లో ప్రయత్నాలు జరిగాయని చరిత్ర చెబుతోంది.అప్పటికి కాంగ్రెస్ పార్టీ వెలుపల ఉన్న కాపులందరినీ కొత్త రాజకీయ శక్తి తెలుగుదేశం పార్టీలోకి పోకుండా నిరోధించడానికి కాంగ్రెస్ గట్టిగా ప్రయత్నించింది.'కాపునాడు' పేరుతో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఆశీస్సులతో 'కాపు రాజకీయ సమీకరణ'కు ప్రయత్నాలు జరిగాయి.కాపులను రాజకీయంగా బలోపేతం చేయడానికి గాను ఆనాడు మంత్రి సంగీత వెంకటరెడ్డి వంటి వారు కృషి చేశారు.1978లో తూర్పు గోదావరి జిల్లాలో అప్పటి ఆలమూరు నుంచి వెంకటరెడ్డి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. కాపు కులాలను, వెనుకబడిన తరగతుల్లో (బీసీలు) చేర్చాలని,తద్వారా వారికి బీసీ కోటా ఇవ్వాలనే నినాదం 'కాపునాడు' ఉద్యమంతో ముందుకు తీసుకొచ్చారు కానీ, 'కాపులకు రాజ్యాధికారం' ఇవ్వాలన్న డిమాండు చేయకపోవడం చారిత్రిక విషాదం.1983 జనవరిలో అసెంబ్లీ ఎన్నికల్లో సంగీత వెంకటరెడ్డి ఆలమూరులో ఓడిపోయారు.జనతాపార్టీ,టీడీపీ,కాంగ్రెస్ పార్టీల తరఫున పత్తిపాడు నుంచి ఎమ్మెల్యేగా గెలిచి పలుమార్లు మంత్రి అయిన ముద్రగడ పద్మనాభం 'కాపులకు బీసీ హోదా' కోసం అనేకసార్లు ఉద్యమించారు.మెగాస్టార్ చిరంజీవి నాయకత్వంలో ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటు చేయడానికి సంబంధించిన సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా 2008లో కాపులకు బీసీ కోటా కావాలంటూ కాపు సామాజిక వర్గ మేధావులు అక్కడక్కడా సమావేశాలు నిర్వహించారు. చిరంజీవి పార్టీ 'కాపు కులాలకు బీసీ రిజర్వేషన్లు' సాధించడం కోసమా? అనే చర్చ జరిగింది. బీసీలు, ఇతర కులాల్లోనూ ఇలాంటి అనుమానాలు కలిగాయి. కాపులకు అసలు కావలసింది బీసీ హోదాయా? రాజ్యాధికారమా? అనే విషయంపై కాపు, బలిజ, తెలగ, ఒంటరి తదితర సామాజిక వర్గాల ప్రజల్లో అయోమయం ఏర్పడింది.చిరంజీవి పార్టీ స్థాపన కోసం రాజకీయ సమీకరణ కేవలం బీసీ హోదా కోసమే అనే రీతిలో కాపు నేతలు ప్రవర్తించారు. మొదట కాపు రిజర్వేషన్లకు,వారికి బీసీ హోదాకు వ్యతిరేకంగా బీసీ సంఘం నాయకుడు,ప్రస్తుతం వైసీపీ రాజ్యసభ సభ్యునిగా ఉన్న ఆర్. కృష్ణయ్య మాట్లాడారు. నాటి కాంగ్రెస్ ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతో 'కాపులకు బీసీ హోదా' ఇవ్వడం పట్ల తనకు అభ్యంతరం లేదని కృష్ణయ్య అప్పట్లో ప్లేటు ఫిరాయించారు.

ముఖ్యమంత్రి పదవి ఇప్పటి వరకూ దక్కకపోయినా రెండు తెలుగు రాష్ట్రాలలో రెడ్లు,కమ్మల కన్నా వార్తల్లో ఎక్కువగా ఎలా నిలవాలో కాపు జనసందోహాలు తెలుసుకున్నాయి. ఆ మేరకు రాజకీయంగా లబ్ధిపొందుతున్నాయన్న విమర్శలున్నవి. ప్రస్తుత ఏపీలో రెండు 'పాలకవర్గ కులాల'తో కులాలతో బేరమాడుతూ తమ డిమాండ్లు నెరవేర్చుకుంటున్నారు. కాకినాడ సిటీ శాసనసభ్యుడు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిపై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ విమర్శల వర్షం కురిపించగానే గారు ద్వారంపూడి కుటుంబానికి వత్తాసుగా కాపునాడు నాయకుడు ముద్రగడ మాట్లాడారు. ముద్రగడ వెనుక అధికారపార్టీ వైసీపీ ఉందన్నది బహిరంగ రహస్యం. ద్వారంపూడిపై పవన్ విమర్శలు చేసిన సన్నివేశానికి చాలా రోజుల ముందే వైసీపీతో ముద్రగడకు అనుబంధం ఏర్పడి ఉంది. ముద్రగడను వైసీపీలోకి ఆహ్వానించారు. వైసీపీ ఎంపీ, ముఖ్యమంత్రి జగన్ సన్నిహితుడు మిథున్ రెడ్డి చర్చలు ఫలించాయి. వచ్చే ఎన్నికల్లో కాకినాడ లోక్ సభ నుంచి లేదా పిఠాపురం అసెంబ్లీ సెగ్మెంటు నుంచి కానీ ముద్రగడ పద్మనాభం లేదా ఆయన కుటుంబసభ్యులు పోటీ చేసే అవకాశాలున్నవి. మిగిలిన అగ్రకులాల లాగే అన్ని పార్టీల్లోనూ కీలక స్థానాలను సాధించుకుంటూ తమ జాతి ప్రయోజనాలు ఎలా కాపాడుకోవాలో కాపులు నేర్చుకున్నారని, లౌక్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలున్నవి.పరిస్థితి ఇలాగే కొనసాగితే కాపులకు ఏదో ఒక రాజకీయ పార్టీ నుంచి కొన్ని ఎంపీ,కొన్ని ఎమ్మెల్యే సీట్లు దక్కవచ్చు. కొందరు మంత్రులు కావచ్చు. అంతకుమించి 'రాజ్యాధికారం' గురించి మాట్లాడడం, చర్చించడం, ఆకాంక్షించడం వాస్తవానికి విరుద్ధంగా ఉంటుంది.

# తమ్ముళ్లలో ఆగస్టు టెన్షన్



విజయవాడ, ఆగస్టు 1, ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతున్న తరుణంలో తెలుగుదేశం పార్టీకి ఆగస్ట్ టెన్షన్ మొదలైంది. పార్టీ ఆవిర్భావం నుంచి కీలక మార్పులు, నిర్ణయాలన్నీ ఆగస్ట్‌లోనే జరిగాయి. పార్టీకి నష్టం కలిగించేలా కొన్ని ప్రధాన ఘట్టాలన్నీ ఆగస్టులోనే జరిగాయి. దీంతో ఈ ఆగస్ట్‌లో ఏం జరగబోతుందనే టెన్షన్ .. అటు ముఖ్య నాయకుల్లో.. ఇటు తెలుగు తమ్ముళ్లలో మొదలైంది. తెలుగుదేశం పార్టీని 1982లో ఎన్టీఆర్ స్థాపించిన తర్వాత 1984లో నాదెండ్ల భాస్కర్ రావు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేందుకు ఎన్టీఆర్ పై తిరుగుబాటు చేసారు. కేవలం నెలరోజుల పాటు మాత్రమే సీఎం పదవిలో ఉన్నప్పటికీ.. ఆగస్ట్ లో జరిగిన పరిణామాలతో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు మాత్రం ఆగస్ట్ సెంటిమెంట్ గానే భావించారు. ఇక ఆ తర్వాత ఆగస్ట్ నెలాఖరులోనే ఎన్టీ రామారావు నుంచి చంద్రబాబు నాయుడు పార్టీ పగ్గాలను దక్కించుకున్నారు. ఇలా రెండుసార్లు ఎన్టీ రామారావు తన ముఖ్యమంత్రి పదవిని ఆగస్ట్ లోనే కోల్పోవడంతో తెలుగుదేశం పార్టీకి ఆగస్ట్ నెల కలిసిరాదనే సెంటిమెంట్ బలంగా పాతుకుపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఆగస్ట్ మాసం వచ్చిందంటే చాలు ఏం జరుగుతుందోననే టెన్షన్ అటు కీలక నేతల్లో.. ఇటు పార్టీ కార్యకర్తల్లో కనిపిస్తుంది.ఆగస్ట్ నెల పార్టీకి చేదు అనుభవాలనే మిగిల్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2000వ సంవత్సరంలో బషీర్ బాగ్ కాల్పుల ఘటన మాయని మచ్చగా మిగిలిపోయింది. రైతులపై చంద్రబాబు హయాంలో జరిగిన కాల్పుల ప్రభావం 2004 ఎన్నికల్లో చాలా స్పష్టంగా కనిపించింది. అయితే, కాల్పులు జరిగింది మాత్రం ఆగస్ట్ కావడం చర్చించుకోదగ్గ విషయంగా మారింది. ఇక 2019లో అధికారం కోల్పోయిన తర్వాత కూడా పార్టీకి ఆగస్ట్ కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. అధికారం కోల్పోయిన తర్వాత ఆగస్ట్ కంటే రెండు నెలల ముందుగానే టీడీపీ రాజ్యసభ ఎంపీలు బీజేపీలో చేరిపోయారు. ఇక గతంలో జరిగిన అనుభవాలతో ఈసారి ఆగస్టులో ఏం జరగనుందనే చర్చ మొదలైంది. ఇప్పటికే అమరావతిలో అసైన్డ్ భూముల కుంభకోణంపై హైకోర్టులో విచారణ జరుగుతుంది. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ మంత్రి నారాయణతో పాటు పలువురిపై నమోదైన కేసు విచారణ వేగంగా జరుగుతుంది. ఈకేసు తుది విచారణ ఆగస్ట్ 10న జరపాలని హైకోర్టు నిర్ణయించింది. ఉన్నత న్యాయస్థానం ఏం తీర్పు ఇవ్వనుంది అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇక రాష్ట్రంలో పొత్తులకు సంబంధించి ఆగస్టులోనే స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తుంది. ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా పురంధేశ్వరి నియామకం, పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటనల తర్వాత పొత్తుల అంశం డైలమాలో పడింది. దీంతో ఆగస్టులో ఎవరు ఎవరితో నడుస్తారనే దానిపై స్పష్టత రావచ్చంటున్నారు తెలుగుదేశం పార్టీ నేతలు..ఎంతకాదనుకున్నా ఆగస్ట్ టెన్షన్ మాత్రం చంద్రబాబు మొదలు పార్టీ నేతలు, కార్యకర్తల్లో కనిపిస్తూనే ఉంటుంది. దీంతో ఎలాంటి సమస్య రాకుండా పకడ్బందీగా పార్టీలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు చంద్రబాబు. ఇక ఆగస్ట్ లో పదిరోజుల పాటు రాయలసీమల ప్రాజెక్టుల సందర్శనతో ప్రజల్లోనే ఉండేలా ప్లాన్ చేసుకున్నారు. ఆ తర్వాత కూడా భవిష్యత్తుకు భరోసా కార్యక్రమం ద్వారా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నారు.

# స్పీకర్ కు తప్పని ఇంటి పోరు

శ్రీకాకుళం, ఆగస్టు 1, ఏపీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారామ్‌కు సొంత నియోజకవర్గం ఆమదాలవలసలో సెగలు రేగుతున్నాయట. ఇన్నాళ్ళు సెగ్మెంట్‌లో బలమైన నేతగా ఉన్న తమ్మినేనికి ఇప్పుడు సొంత సామాజిక వర్గం నేతలే ఎర్త్ పెట్టే ప్రయత్నాల్లో ఉన్నటు తెలిసింది. 2019 ఎన్నికల తరువాత సైలెంట్‌గా ఉన్న అసమ్మతి నేతలు ఇటీవల యాక్టివ్ అయ్యారని, అందుకే వారు ఎమ్మెల్యేతో అంటీ ముట్టనట్టుగా ఉన్నారన్నది లోకల్ టాక్. స్థానిక వైసిపి సీనియర్ నేతలు సువ్వారి గాంధీ , చింతాడ రవికుమార్ తోపాటు కోటా బ్రదర్స్ సమాంతర రాజకీయం నడుపుతూ? ఆయనకు సవాల్ విసురుతున్నారట. ఆమదాల వలస వైసీపీలో రెబెల్స్ మూడు గ్రూపులుగా ఉన్నారు. వీళ్లందర్నీ ఒకతాటి మీదికి తీసుకువచ్చి తాను నాయకత్వం బాధ్యతలు తీసుకునే ప్రయత్నాల్లో ఉన్నారట సువ్వారి గాంధీ. అధిష్టానానికి అభ్యర్థిని మార్చాలన్న ఆలోచన వస్తే? ఆ ఛాయిస్ తానే కావాలన్నది ఆయన ప్లాన్.ఈ ఎత్తులు, పై ఎత్తులతో నియోజకవర్గ పార్టీ కేడర్‌లో గందరగోళం పెరుగుతుతోంది. పరిస్థితి ఇలాగే ఉంటే? ఇక్కడ వచ్చే ఎన్నికల్లో వైసిపి గెలవడం అంత తేలికకాదని వైసిపి క్యాడరే అంటోందట. కొందరు ద్వితీయ శ్రేణి నేతలు కూడా మండలాల వారిగా విడిపోయి మీది సువ్వారి వర్గం , మాది తమ్మినేని వర్గం అంటూ సవాళ్లు ప్రతి సవాళ్లు విసురుకుంటున్నారు. బర్త్ డేల పేరుతో బల ప్రదర్శలు జరుగుతున్నాయి. గతంలో కోట బ్రదర్స్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించి తమ్మినేనికి సవాలు విసిరారు. తర్వాత సువ్వారి గాంధీ భారీ బైక్ ర్యాలీ నిర్వహించడంతో పాటు బర్త్ డే పేరుతో ఆత్మీయ సమావేశం పెట్టారు. పొందూరు , సరుబుజ్జిలి , బూర్జ , ఆమదాలవలస మండలాల నుంచి పెద్ద ఎత్తున వైసిపి నేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇది చూస్తున్న వారంతా అసమ్మతి గ్రూపులను కట్టడి చేయుటంలో విఫలమైన తమ్మినేని రాజకీయంగా సవాల్ ఎదుర్కొంటున్నారని కామెంట్ చేస్తున్నారు.ఈసారి ఎన్నికల్లో తమ్మినేనికి కాకుండా ఎవరికి టిక్కెట్ ఇచ్చినా గెలుస్తామని అంటున్నారు రెబెల్స్ సువ్వారి గాంధీ , చింతాడ రవికుమార్. ఆ అసమ్మతి గ్రూపుల నేతలు ధర్మాన ప్రసాదరావుతో కలిసి మంత్రాంగం నడపడం ఇక్కడ చెప్పుకోవాల్సిన ట్విస్ట్. మరో వైపు వైసీపీ అంతర్గత విభేదాలు?. టీడీపీకి కలిసి వస్తున్నాయట. ఇక్కడ ప్రతిపక్ష కేడర్ ఇప్పటికీ బలంగానే ఉంది. పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఇన్ఛార్జ్‌గా ఉన్నారు. మూడు ముక్కలాటతో వైసీపీ సతమతం అవుతుంటే? దాన్ని అనుకూలంగా మలుచుకుని పాగా వేసే దిశగా తెలుగుదేశం వ్యూహాలు సిద్ధం చేసుకుంటోందట. ఎవరి ప్రయత్నాలు ఎంతవరకు సక్సెస్ అవుతాయో చూడాలి.

# నాసాలో తెలుగు అబ్బాయి

గుంటూరు, ఆగస్టు 1, నాసా లో ఉద్యోగం సాధించడం అంటే అంత తెలికైన విషయం కాదు. నాసాలో ఎలాగైనా ఉద్యోగం సాధించాలని ఎంతో మంది కలలు కంటూ ఉంటారు. కానీ దానికి ఎంతో పట్టుదల, కృషి ఉండాలి. కానీ అది అందరి వల్ల కాదు. కొందరు మాత్రమే నిజం చేసుకుంటారు. ఇలాంటి ఎంతో ఉన్నతి స్థాయి సంస్థలో తెలుగుబ్బాయి అది కూడా గుంటూరు కుర్రాడు ఉద్యోగం సాధించి చూపించాడు. అయితే ఆ కుర్రాడికి ఇదేమి ఒకేసారి వచ్చేయలేదు. ఎన్నో కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు , కుటుంబ సమస్యలు ఇలాంటి సమస్యలన్నింటిని ఎన్నో వాటిని దాటుకుంటూ ముందుకు వచ్చి ధైర్యంగా నిలిచాడు. చివరికి అనుకున్న లక్ష్యాన్ని సాధించాడు. గుంటూరుకు చెందిన హర్షవర్దన్ రెడ్డి అనే యువకుడు ప్రపంచంలోనే ప్రతిష్టాత్మకమైన అమెరికా నేషనల్ ఏరోనాటిక్స్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్‌లో ఉద్యోగం సాధించాడు. హర్షవర్ధన్ రెడ్డి తల్లిదండ్రులు ఈశ్వర్ రెడ్డి, పార్వతిలు. వారి స్వస్థలం కడప. కానీ ఎన్నో సంవత్సరాల కిందటే గుంటూరుకు వచ్చి స్థిరపడిపోయారు. వారికి ఇద్దరు పిల్లలు. ఇద్దరిని కూడా బాగా చదివించాలనుకున్నారు. వారిద్దరూ కూడా ఓ ప్రైవేటు పాఠశాలలో ఉద్యోగం చేస్తూ వారిని ఉన్నత చదువులు చదివించారు.ఇద్దరు కుమారుల్లో హర్షవర్ధన్ రెడ్డి పెద్దవాడు. అతను చిన్నతనం నుంచి కూడా చదువులో ఎంతో చురుకుగా ఉండేవాడు. పులివెందులలో పది, హైదరాబాద్ లో ఇంటర్ పూర్తి చేశాడు. అనంతరం జేఈఈలో మంచి మార్కులు సాధించి ఐఐటీ గౌహతిలో సీటు సంపాదించాడు. అక్కడ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. మంచి ప్రతిభ చూపడంతో సిల్వర్ మెడల్ కూడా సాధించాడు. దీంతో హర్షవర్ధన్ కు ఓఎన్జీసీ వాళ్లు లక్ష రూపాయల ఉపకార వేతనం అందించి బంగారు పతకం ఇచ్చింది. ఇంజనీరింగ్ పూర్తి అయిన తరువాత హర్షవర్ధన్ రెడ్డి పీహెచ్‌డీ చేయాలనుకున్నాడు. అయితే కుటుంబ పరిస్థితులు అందుకు సహకరించలేదు. హర్షవర్ధన్ తమ్ముడు నందన్ రెడ్డి ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీ పరీక్షలకు ప్రిపేరవుతున్నాడు. దీంతో ఇద్దరిని చదివించడం కొంచెం తండ్రికి కష్టంగా మారింది. దీంతో హర్ష రిలయన్స్ సంస్థలో ఉద్యోగంలో చేరాడు. అక్కడ రెండు సంవత్సరాల పాటు ఉద్యోగం చేశాడు. దీంతో వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు కొంత మెరుగుపడ్డాయి. వెంటనే కాలిఫోర్నియా యూనివర్సిటీలో పీహెచ్ డీ చేసుకునేందుకు అప్లై చేసుకున్నాడు. అక్కడ సీటు రావడంతో వెంటనే చేరిపోయిన హర్ష.. ఏరో స్పేస్ పీహెచ్‌డీ చేస్తున్నాడు. అక్కడ ఉండగానే నాసాలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కాలిఫోర్నియాలోని నాసా ఫీల్డ్ సెంటర్ లో ఇంజనీర్ గా బాధ్యతలు స్వీకరించాడు. ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగితే అనుకున్నది సాధించలేనిది ఏది లేదంటూ ఈ గుంటూరు కుర్రాడు చేసి చూపించాడు.

## దివ్యాంగులకు మోటార్ ట్రై సైకిల్స్ పంపిణీ చేసిన హోంమంత్రి తానేటి వనిత

కొవ్వూరు దివ్యాంగులు ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి వెళ్లాలన్నా చాలా కష్టపడే వారని, వారికి చేదోడుగా సహాయ కారిగా ఉండేందుకు ఉచితంగా మూ డు చక్రాల మోటార్ సైకిల్స్ అందచేస్తు న్నామని రాష్ట్ర హోంమంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత తెలిపారు.కొవ్వూరు స్థానిక క్యాంపు కార్యాల యం ఆవరణలో కొవ్వూరు నియోజకవర్గానికి చెందిన 10 మంది దివ్యాంగులకు మోటార్ ట్రై సైకిల్స్ పంపిణీ చేశారు. దివ్యాంగులతో కాసే పు ముచ్చటించి వారి యోగక్షేమాలను ఒక్కొక్కరినీ అడిగి తెలసుకున్నారు..

ఈ సందర్భంగా హోంమంత్రి తానేటి వనిత మాట్లాడు తూ.. రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతితో పాటు దివ్యాం గుల సంక్షేమం, వారి ఆర్థికాభివృద్ధి కోసం ప్రభు త్వం కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహ న్ రెడ్డి అన్ని వర్గాల వారికి ఒక అన్నలా, తమ్ముడిలా, ఒక కొడుకుగా బాధ్యత తీసుకుని సేవలందిస్తున్నారని తెలిపా రు.దివ్యాంగుల విద్యార్థిభివృద్ధి, వ్యాపారాభి వృద్ధి కోసం ట్రై సైకిల్స్ ఉచితంగా అందజేయడం జరు గు తుందన్నారు. వీటి ద్వారా వారిలో ఆత్మ విశ్వాసం పెంచడం ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు.

## తాగునీటి డ్రైనేజీ వీధిలైటు సమస్యలు పరిష్కరించాలి




పెద్దకడబూరు ఆగష్టు 01: n ( విభారె న్యూస్) సిపిఐ డిమాండ్లతో కూడుకున్న వినతిపత్రం ఎంపీడీవోకి శ్రీనివాసులకు ఇవ్వడం జరిగింది పెద్దకడబూరు మండలంలోనిభారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆధ్వర్యంలో ఎంపీడీవో ఆఫీసు నందు ధర్నా చేపట్టడం జరిగింది ధర్నా ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్ సిపిఐ మండల కార్యదర్శి వీరేష్ సిపిఐ సహాయ కార్యదర్శి కుమ్మరి చంద్ర రైతు సంఘం నాయకులు ఆంజనేయ మాట్లాడుతూ మండలంలో ఆయా గ్రామంలో డ్రైనేజీలు వీధిలైట్లు తాగినీటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయి వెంటనే నిండిపోయిన డ్రైనేజీలను క్లీన్ చేయాలని తాగునీటి సమస్య పరిష్కరించాలని వీధిలైట్లు బలుపు వెయ్యాలని పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసులకు విన్నవించిన కానీ సమస్య పరిష్కరించడం లేదని వెంటనే పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసుల పై చర్యలు తీసుకోవాలని సిపిఐ పార్టీగా డిమాండ్ చేస్తున్నాం ఈ విషయంపై మండల ఎంపీడీవో గారు స్పందించి వెంటనే ఈ సమస్యపై వెంటనే పంచాయతీ సెక్రెటరీ పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో గోపాలు తిక్కన్న రామాంజనేయులు వీరేష్ నరసింహులు వీరాంజనేయులు సర్దాజీ పటేల్ హనుమంతు రెక్కల గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు

## పింఛన్ల పంపిణీని పర్యవేక్షించిన ఎంపీడీఓ



పెద్దకడబూరు ఆగష్టు 01: ( విభారె న్యూస్)పెద్దకడబూరు మండలంలోని హనుమాపురం గ్రామంలో మంగళవారం పింఛన్ల పంపిణీని ఎంపీడీఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కొంత మంది లబ్ధిదారులకు గ్రామ సర్పంచ్ ఇందిర ఈరన్నతో కలిసి ఎంపీడీఓ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలెంటీర్లు ప్రభుత్వం నిర్ణయించిన వ్యవధిలోగా సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. పింఛన్ల పంపిణీ ఎటువంటి అవకతవకలు జరిగినా వాలెంటీర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అటెండర్ భార్య మృతికి తహసీల్దార్ నివాళి





పెద్దకడబూరు ఆగష్టు 01:( విభారె న్యూస్)పెద్దకడబూరు లో మండల తహసిల్దార్ ఆఫీసులో అటెండర్ గా పనిచేస్తున్న సింగ్ భార్య మంగళవారం అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వీరేంద్ర గౌడ్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, వీఆర్వోలు వీరారెడ్డి, నరసప్ప, మాజీ వీఆర్వో రామలింగారెడ్డి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అటెండర్ సింగ్ ను ఓదార్చి ధైర్యం చెప్పారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 15000 ఆర్థిక సహాయం అందజేశారు.

## హనుమాపురంలో యుపీ స్కూల్ అకస్మిక తనిఖీ

పెద్దకడబూరు ఆగష్టు 01: ( విభారె న్యూస్)పెద్దకడబూరు మండలంలోని హనుమాపురం గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాసరావు అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం, పాఠశాల పరిధిలో బడి బయట పిల్లల సంఖ్య వంటి వాటి గురించి హెచ్ఎం సత్యకరుణను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం. బడిలో నాణ్యత ఉండేలా చూడాలన్నారు. తర్వాత గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి, సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ ఆదేశించారు.



## జంతర్ మంతర్ వద్ద రాయలసీమ రైతుల ధర్నా విజయ వంతం



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 01 విభారె న్యూస్ :–రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో రాయలసీమ హక్కులకై సేవ్ రాయలసీమ పేరుతో నీళ్లు, నిధులు, నియామకాల సమాన వాటా తో పాటు కర్ణాటక ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న అప్పర్ భద్ర మరియు నవలీ ప్రాజెక్టులు నిలుపుదల చేయాలని, నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సంగమేశ్వరం వద్ద కృష్ణానదిపై కేంద్ర ప్రభుత్వం నిర్మించబోయే ఐకానిక్ బ్రిడ్జి( తీగల వంతెన ) బదులు రోడ్డు కం బ్యారేజ్ నిర్మించాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వేలాది మందితో చేపట్టిన సేవ్ రాయలసీమ కార్యక్రమం విజయవంతమైందని రాయలసీమ స్టీరింగ్ కమిటీ నంద్యాల జిల్లా నాయకులు యం. వి. రమణారెడ్డి, డాక్టర్ . ఎమ్ రామిరెడ్డిలు అన్నారు. నంద్యాల జిల్లా నలుమూలల నుండి వందలాది రాయలసీమ రైతులు, యువత పాల్గొని విజయవంతం చేసినందుకు ధన్యవాదములు తెలిపారు .

## వ్యర్థాలు వేయకుండా చూడండి

### రవి చంద్రా రెడ్డి కమిషనర్





నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 01 విభారె న్యూస్ :- పట్టణంలో కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా బాధ్యులైన సిబ్బంది చూడాలని మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి సూచించారు. మంగళవారం నాడు పద్మావతి నగర్ యందు సిమెంట్ రోడ్డు ను. ఎమ్ ఎస్ నగర్ లో ఏర్పాటు చేస్తున్న పైపు లైన్ పనులను తనిఖీ చేశారు. అలాగే ఎమ్ ఎస్ నగర్ లో ఉన్న సచివాలయం ను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు . కమిషనర్ రవి చంద్రా రెడ్డి మాట్లాడుతూ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఎక్కడైనా చెత్త చెదారం వేస్తుంటే జరిమానా విధించాలని ఆదేశించారు. భవన నిర్మాణ వ్యర్థాలు వేస్తున్న వారిని సైతం గుర్తించాలని ప్రజారోగ్య విభాగాల అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట మున్సిపల్ డీఈ జయ భరత్ రెడ్డి. శ్రీనివాస్ రెడ్డి. మదు కుమార్. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. ఇన్ స్పెక్టర్ శివ ప్రసాద్ రెడ్డి. సచివాలయ సిబ్బంది. మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## ధార్మిక పండితులు వద్దిపర్తి పద్మాకర్ స్వామి కర్నూలుకు రాక.



కర్నూలు ఆగష్టు 1 విభారె న్యూస్.ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రణవ పీఠాధిపతులు, అభినవ శుక, త్రిభాషా మహాసహస్రావధాని, బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ స్వామిజీ కర్నూలు పట్టణంలో వెలసిన శ్రీ గోదాగోకులానికి మహర్షుల చరిత్ర అనే అంశంపై ఆగష్టు 3 సాయంత్రం 6 గంటలకు, 4వ తేదీ ఉదయం 10 గంటలకు ధార్మిక ప్రవచనం చేయుటకు వస్తున్నట్లు గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమకాలీన సామాజిక పరిస్థితులకు అవసరమైన ఎన్నెన్నో ప్రసంగాలు చేసి ఎన్నెన్నో అంతర్జాతీయ రికార్డులను సృష్టించిన ఈ మహాపండితుడు కర్నూలు నగరానికి రావడం ఎంతో ఆనందించదగ్గ విషయంగా భావిస్తున్నాము.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనగలరని తెలిపారు.

## జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమంలో 2,84,507 సర్టిఫికెట్లు పంపిణీ



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 01 విభారె న్యూస్ :–ప్రభుత్వ సేవలు అందుకోవడంలో అర్హులైన ఏ ఒక్కరు సంక్షేమం అందుకోకుండా మిగిలిపోరాదన్న సీఎం జగన్ లక్ష్యానికి అనుగుణంగా వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికార యంత్రాంగం వినూత్న రీతిలో జగనన్న సురక్ష విధులను అంకిత భావంతో నిర్వర్తించిందని జిల్లా రెవెన్యూ అధికారి బి పుల్లయ్య మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ .నంద్యాల జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమం కోసం..వాలంటీర్లు 5,45,733. కుటుంబాలను సర్వే చేశారన్నారు . జిల్లాలో 516 జగనన్న సురక్ష. క్యాంపులు నిర్వహించినట్లు తెలిపారు. నంద్యాల జిల్లాలో 2,84,507 సర్టిఫికెట్లను జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అందజేశారని తెలిపారు.

## ప్రాయశ్చిత హోమంలో పాల్గొన్న ఎండోమెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దంపతులు.

కర్నూలు ఆగష్టు 01విభారె న్యూస్. అధిక శ్రావణ మాసం మంగళవారం తో కూడిన పౌర్ణమి సందర్భంగా గౌరవనీయులు (ఎండోమెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) శ్రీమతి శైలజ,సతీష్ దంపతులు ప్రాయశ్చిత్త హోమములలో విశేషమైన ఫలితములను కలిగించేటువంటి కూష్మాండ సూక్త మంత్రములతో కూష్మాండ హోమమును చేసుకోవటం జరిగినది.



## కోదండరామాలయం 108 జంటలతో ధనలక్ష్మి పూజ

నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 01 విభారె న్యూస్ :- నంద్యాల సంజీవ నగర్ కోదండరామాలయం లో శ్రీ భగవత్ సేవా సమాజ్ ప్రాంగణంలో మంగళవారం అధిక శ్రావణ మాసం పౌర్ణమి మంగళకరమైన మంగళవారం రోజు 108 జంటలతో "విశేష శ్రీ ధనలక్ష్మి పూజ" లోక కళ్యాణం కోసం మరియూ సమస్త రుణబాధలు తొలగటానికి, ఆర్థిక అభివృద్ధికి, సర్వ మంగళములు కలగాలనిశ్రీ ధనలక్ష్మి అమ్మవారికి జరిగిన విశేష పూజలో భక్తులందరి చేత విశేష సంకల్పం, ఆరంభం గణపతి పూజ, సహస్ర నామ కుంకుమార్చన, అష్టలక్ష్ములకు పూలతో విశేష అర్చన, శ్రీ సూక్తం పఠన తో కుంకుమార్చన, దివ్య మంగళ నీరాజనం గావించారు. పూజలో విశేష రీతిలో భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. తన్మయత్వం చెందారు.పూజ అనంతరం భక్తాగ్రేసరులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



## మణిపూర్ ఘటనకు నిరసనగా కొవ్వొత్తులతో నిరసన.



కోడుమూరు ఆగస్టు 01 విభారె న్యూస్.మణిపూర్ ఘటనను నిరసిస్తూ కోడుమూరు నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ సోమవారం సాయంకాలం ఏడున్నర గంటలకు కొవ్వొత్తుల నిరసన కార్యక్రమమును నియోజకవర్గ ఇంచార్జ్ దామోదరం రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో బాలాజీ నగర్ ఆటో స్టాండ్ కూడలి యందు నిర్వహించారు.రాధాకృష్ణ మూర్తి మాట్లాడుతూ మనువాద రాజ్యంలో మానవత్వం ఉండదని ,మోడీ,అమిత్ షా దేశ సమగ్రతను ధ్వంసం చేస్తున్నారని,మానవతా వాదులు పాలకులు చేస్తున్న కుట్రలను గమనించి జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉ ందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ వైస్ చైర్మన్ వసి బాషా,39 వార్డు ఇంచార్జ్ మినల్ల హుస్సేన్, రామస్వామి,సిద్దార్థ్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అధిక శ్రావణ మంగళవారం ను పురస్కరించుకొని శ్రీ సుంకులమ్మ అవ్వ కు ప్రత్యేక పూజలు.



ఎమ్మిగనూరు ఆగష్టు 01 విభారె న్యూస్.స్థానిక మెయిన్ బజార్ లో వెలసిన శ్రీ సుంకులమ్మ అవ్వ దేవాలయంలో అమ్మ వారికి అధిక శ్రావణ మంగళవారం ను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రాతః కాలంలోనే అమ్మవారికి అభిషేకం, అర్చన, అలంకరణ చేసి, నిమ్మకాయల మాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అమ్మవారికి మహా మంగళహారతి నిర్వహించారు.అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులై తమ తమ మొక్కులు తీర్చుకున్నారు.ఒడి బియ్యం సమర్పించారు.తదుపరి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.పై పూజా కార్యక్రమాలు అన్నియు ఆలయ పూజారులు నాగరాజు దంపతులు నిర్వహించారు.

## అధిక శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి 5వ రోజు కుంకుమార్చన.



కర్నూలు ఆగష్టు ఒకటి విభారె న్యూస్.శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం నందు అధికమాసం సందర్భంగా మహా గౌరీ అమ్మవారికి జరుపబడుతున్న కోటి కుంకుమార్చన లో భాగంగా ఐదవ రోజు ఉదయం గణపతి పూజ మండపారాధన, లలిత సహస్రనామ పారాయణ పూర్వక కుంకుమార్చన జరిగినది.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు అయ్యారు.అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగినది.

## నేడు సిపిఐ. నంద్యాల జిల్లా కార్యవర్గ సమావేశం



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 01 విభారె న్యూస్ :- బుధవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయం ( స్వామి రెడ్డి భవన్) నందు సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం కలదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు. బాబా ఫకృద్దీన్. మంగళవారం నాడు ఓ ప్రకటన లో తెలిపారు . ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు. జి ఓబులేష్ . పి.రామచంద్రయ్య . బి జగదీష్ . సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు ముఖ్యఅతిథిలుగా పాల్గొంటారని తెలిపారు. . కావున నంద్యాల జిల్లా సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు సకాలంలో హాజరు కావలసినదిగా సూచించారు .

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190